'సాక్షి' ఆధ్వర్యంలో రేపు ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం సాక్షి ఆధ్వర్యంలో శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవినగర్‌లోని శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ ఆవరణలో ఉదయం 9:30 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానుంది. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు. పోటీలో పాల్గొనేవారు ఎవరి మెటీరియల్‌ను (కలర్స్, ముగ్గులు) వారే తెచ్చుకోవాలి. తెలుగు సంప్రదాయం, పల్లెటూరి వాతావరణం, సంక్రాంతి పండుగ ఉట్టిపడే విధంగా వేసిన ముగ్గులకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. వివరాల కోసం 7997995252ను సంప్రదించవచ్చు. –సుభాష్‌నగర్

మేడ్చల్‌కు మెట్రో కారిడార్ విస్తరణపై హర్షం



ఎమ్మెల్యే వివేకానంద గౌడ్‌ను సన్మానిస్తున్న మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు

కుత్బుల్లాపూర్ : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఉత్తర తెలంగాణ ప్రాంతానికి కీలకమైన మెట్రో మంజూరు కావడం హర్షించదగ్గ విషయమని, ఇందుకు మేడ్చల్ మెట్రో సాధన ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు దోహదపడ్డాయని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నుంచి నిత్యం నగరానికి లక్షల మంది ప్రయాణిస్తుంటారని, వారి అభిప్రాయాలకు అనుగుణంగా మెట్రో విస్తరణ చేపట్టడం సంతోషించదగ్గ విషయం అని అన్నారు. కార్యక్రమంలో మెట్రో సాధన సమితి సభ్యులు సంపత్ రెడ్డి, జార్జ్, మహేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ అభివృద్ధికి తోడ్పాటు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయంతో కుత్బుల్లాపూర్ ప్రాంత ప్రజలు ఎప్పుడూ రుణపడి ఉంటారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్తరానికి రెండు కీలక మెట్రో కారిడార్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. అటు శామీర్‌పేట, ఇటు మేడ్చల్ ప్రాంతాల నుంచి అనేకమంది కార్మికులు, ప్రజలు నగరానికి వస్తూపోతుంటారని, వారి అవసరాలకు అనుగుణంగా మెట్రో కారిడార్లు ఏర్పాటు చేయడం ఊరట కలిగించిందన్నారు. గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదన్నారు. మెట్రో సేవలను విస్తరించిన నేపథ్యంలో సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

- శివారు మున్సిపాలిటీల విలీనంపై సందిగ్ధం
- శ్రీధర్ బాబు ప్రకటనతో నేతల్లో చిగురించిన ఆశలు
- 27తో ముగియనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం



విలీనమా.. వ్యూహమా?

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయకుండానే ఎన్నికలు నిర్వహిస్తారనే ఊహాగానాలతో స్థానిక నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల శాసనసభ సమావేశాల్లో మంత్రి శ్రీధర్‌బాబు చేసిన ప్రకటనతో విలీనం లేనట్టేననే సంకేతాన్ని ప్రభుత్వం స్పష్టంగా ఇచ్చినట్లు ఆయా పార్టీల నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుత కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో పాటు ద్వితీయ శ్రేణి నాయకుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఒక వేళ ఎన్నికలు జరిగితే ఈ సారి తప్పకుండా ప్రజాప్రతినిధిగా విజయం సాధించాలనే పట్టుదలతో ఆశావహులు పైరవీలు ప్రారంభించారు.

పునరాలోచనా..వ్యూహాత్మకమా!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శివారు ప్రాంతాలు, రింగ్ రోడ్డు లోపల ఉన్న 21 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే ఆలోచనలతో ఆదేశాలు జారీ చేసింది. అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదనే కారణంగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తుంది. విలీనం దిశగా అధికారులు సైతం చర్యలు ప్రారంభించారు. అంతలోనే లోక్ సభ ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో మంత్రి శ్రీధర్ బాబు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేయడం లేదని ప్రకటించడంతో శివారు ప్రాంతాలను విలీనం చేసే ప్రక్రియపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందా? పునరాలోచనలో పడిందా! లేక పదవీ కాలం పూర్తయ్యే వరకు వ్యూహాత్మకంగా ఈ చర్చకు తెరలేపారా! అనే దానికిపై నాయకులు, ప్రతిపక్షాలు ఆలోచనలో పడ్డారు. జనవరి 27తో శివారులోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీ కాలం ముగియనుంది.

నేతల్లో చిగురించిన ఆశలు

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేయడం లేదనే పుకార్లతో ఆయా డివిజన్లు, వార్డుల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్న నాయకుల్లో ఆశలు చిగురించాయి. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 33 డివిజన్లు ఉన్నాయి. యథావిధిగా ఎన్నికలు జరిగితే 33 నుంచి 50 డివిజన్ల వరకు పెరిగే అవకాశం ఉంది. అన్ని పార్టీల నుంచి సుమారు 200 మంది వరకు ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది. ఇక కొంపల్లి మున్సిపాలిటీలో ప్రస్తుతం 18 వార్డులు ఉన్నాయి. మున్సిపాలిటీగానే ఉంటే మరో 4 వార్డులు పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ సుమారు 100 మంది వరకు వివిధ పార్టీ నుంచి పోటీ చేసే అవకాశం ఉంది. దుండిగల్ మున్సిపాలిటీలో మొత్తం వార్డులు 28 ఉన్నాయి. మున్సిపాలిటీగానే కొనసాగితే మరో 8 వార్డులు పెరిగే అవకాశం ఉంది. ఎన్నికలు జరిగితే సుమారు 150 మంది ఆశావహులు వివిధ పార్టీల నుంచి పోటీ చేసే అవకాశం ఉంది.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం గతంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. కానీ.. ఇటీవల యథావిధంగా కొనసాగిస్తామనే వార్తలు వస్తున్నాయ.ఈ నెలాఖరులోగా మా పాలక వర్గం పదవీ కాలం పూర్తవుతుంది. ప్రభుత్వ నిర్ణయం ఏదైన అభివృద్ధికోసం స్వాగతిస్తాం.
–కొలను నీలా గోపాల్‌రెడ్డి, నిజాంపేట్, మేయర్

యథావిధిగా ఎన్నికలు నిర్వహించాలి



గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా, కార్పొరేషన్లుగా మారి కేవలం 5 సంవత్సరాలే అవుతుంది. ఇప్పటికీ ఇంకా అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగలేదు. నేరుగా ప్రభుత్వం ఇప్పటికిప్పుడు జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే ప్రజలపై భారం పడే ప్రమాదముంది. మరో ఐదేళ్ల పాటు మున్సిపాలిటీలుగానే కొనసాగించి ఎన్నికలు నిర్వహించాలి.
–సన్న శ్రీశైలం యాదవ్, కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్

సీఎంను కలిసిన టీపీసీసీ లేబర్ సెల్



సీఎంకు కరపత్రాన్ని అందజేస్తున్న ప్రకాష్‌గౌడ్ తదితరులు

సుభాష్‌నగర్: టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ రాంబాగ్ ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలు, పథకాల గురించి ముద్రించిన కరపత్రాన్ని సీఎంకు అందజేశారు. కార్యక్రమంలో నల్ల సంజీవరెడ్డి, కాంగ్రెస్ లేబర్ సెల్ జిల్లా అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి, సప్పిడి భాస్కర్, అయిల శ్రీధర్‌గౌడ్, గోకర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీ అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని జైశ్రీరామ్ ఆటో స్టాండ్ యూనియన్ సభ్యుడు షేక్ చాంద్‌పాషా అనారోగ్యానికి గురయ్యాడు. స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2.25 లక్షలు మంజూరయ్యాయి. ఆ ఎల్ఓసీని ఈటల రాజేందర్ బాధితుడికి గురువారం అందజేశారు.

సీజ్ చేసిన వాహనాల వేలం నేడు

పోచారం: ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసిన వాహనాలను గురువారం ఉదయం 11 గంటలకు 8 వాహనాలను వేలం వేస్తున్నట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జూపల్లి రాజు తెలిపారు. వేలం పాటను నారపల్లిలోని ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8712658736 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవాలి



పాతతరం దుస్తులు ధరించిన విద్యార్థులు

సుభాష్‌నగర్: నేటి కంప్యూటర్ యుగంలో పాతకాలం సంస్కృతి మర్చిపోయారని, కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవాలని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ అన్నారు. సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో గురువారం రేట్రో(పాత) కార్యక్రమం నిర్వహించారు. పాతకాలం సంస్కృతి, వస్తువులు, డ్రెస్‌లు, అప్పటి విధి విధానాలు కళ్లకు కట్టినట్లు విద్యార్థులు ప్రదర్శించారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం



గుండా మొగలి

జగద్గిరిగుట్ట: మతిస్థిమితం సరిగా లేని వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... జగద్గిరిగుట్ట భూదేవి హిల్స్‌కు చెందిన రామారావు తండ్రి గుండా మొగిలి(75) ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం ఉ.11 గంటల సమయంలో ఇంటి ఆరు బయట కూర్చుంటానని చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువు అలుగుపై బ్రిడ్జి నిర్మించరా?



తుమార్ చెరువు అలుగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై వెళ్తున్న అయ్యప్ప స్వాములు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని తుమార్ చెరువు అలుగు వద్ద ప్రతిరోజు మురికి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దూలపల్లిలోని 60 శాతం మేర రైతుల పొలాలు ఇక్కడే ఉండడంతో నిత్యం రైతులు ఇదే దారి గుండా వెళ్తుంటారు. దీనికి తోడుగా గుండ్ల పోచంపల్లి, దూలపల్లి గ్రామ ప్రజలు ఈ చెరువు కట్టమీద నుండే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. 5 సంవత్సరాల వ్యవధిలో నిర్మాణాలు మూడింతలు పెరగడంతో జనాభా కూడా అదే స్థాయిలో పెరిగింది. దీంతో తుమార్ చెరువులో మురికి నీరు కలవడం వల్ల 24 గంటల పాటు అలుగు నుంచి దిగువ ప్రాంతానికి మోకాలలోతు ప్రవహిస్తుంది. అటుగా వెళ్లే వారు మురికినీరు ప్రవహిస్తుండటంతో అదనంగా మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. దూలపల్లిలో స్థానికంగా 41 రోజు దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములు శబరిమలకు బయలుదేరేముందు గ్రామ శివారులోని మల్లన్న గుడి వరకు పాదయాత్రగా వెళ్లి రావటం ఆనవాయితీ. గురువారం శబరిమల వెళ్లే క్రమంలో మల్లన్న గుడికి వెళ్లేందుకు మురికినీరు ప్రవహిస్తుండటంతో ఇబ్బంది పడ్డారు. ప్రత్యామ్నాయంగా చెక్కలతో బ్రిడ్జి వేసుకొని వెళ్లారు. సంబంధిత అధికారులు స్పందించి తూము వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుపైనే తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్

భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



రంగారెడ్డినగర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రోడ్డుపై రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డులో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు రావడంతో చుట్టు పక్కల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఫిర్యాదులు అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువచ్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. 20 రోజులుగా తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డుపైనే ఉంచడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించి తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి మహారుద్ర యాగం

- 13 వరకు వివిధ పూజలు, హోమాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- ఎంసీహెచ్ఎస్, భరద్వాజ శ్రీవిద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహణ

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎంసీహెచ్ఎస్, భరద్వాజ శ్రీవిద్యాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు శ్రీ లక్ష్మీనారాయణ మహా రుద్ర యాగం వైభవంగా నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భరద్వాజ శ్రీవిద్యాపీఠం వ్యవస్థాపకులు విష్ణుభట్ల లక్ష్మీనరసింహ శర్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ, శ్రీ చండీ, శ్రీ మహారుద్ర యాగం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్‌గ్వరణములు, జప పారాయణం, గణపతి హోమం, శ్రీ చక్రవావరణ పూజ, అభిషేకం, హారతి, మంత్ర పుష్పములతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శనివారం నుంచి 13వ తేదీ వరకు శివ ముక్కోటి సందర్భంగా ఉదయం 4 గంటలకు మహాన్యాసపూర్వక పూజ, ఏకాదశ రుద్రపూర్వక అన్నాభిషేకం, ముగింపు సందర్భంగా అభిషేకం, హారతి, వేద పండితుల ఆశీర్వాదం, ఋత్విక్ సన్మానముతో ఈ పూజా కార్యక్రమాలు ముగుస్తాయి. ముగింపు సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. 11 రోజుల పాటు జరిగే ఈ హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమంలో మోతీనగర్ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేషన్‌కార్డులో నమోదుకాని పేర్లు!

- పెండింగ్‌లో 86,885 మ్యుటేషన్ల దరఖాస్తులు
- గత సర్కారు హయాంలో 90 వేల రేషన్ కార్డులు రద్దు
- కొత్త కార్డుల కోసం 1.89 లక్షల దరఖాస్తులు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని ఉప్పల్‌లో నివసిస్తున్న దేవేందర్ నాలుగేళ్ల కిందట తన పాప పేరు రేషన్ కార్డులో చేర్చాలని మీ–సేవలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం తన రెండో బాబు వివరాల నమోదు కోసం మీ–సేవ కేంద్రానికి వెళ్లారు. పాతది పెండింగ్‌లో ఉన్నందున ఈ వివరాలు నమోదు చేస్తే దరఖాస్తు తీసుకోవడం లేదు. ఈ పరిస్థితి ఒక మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే కాదు.. అంతటా నెలకొని ఉంది. ఐదేళ్లుగా మీ–సేవ కేంద్రంలో రెండో బిడ్డ వివరాలు చేర్చేందుకు అవకాశం లేకుండా పోయింది. కనీసం దరఖాస్తు చేసుకోవటానికి కూడా వీల్లేకుండా పోయింది.

పెండింగ్‌లో 86 వేల దరఖాస్తులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తమ పిల్లల పేర్లను ఆహార భద్రత కార్డులో నమోదు చేసుకునేందుకు మీ–సేవ కేంద్రాల్లో 86,885 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఐదేళ్లుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇందులో బాలానగర్–1లో 35,735 దరఖాస్తులు, బాచుపల్లిలో 1260, గండిమైసమ్మ దుండిగల్‌లో 2,669,ఘట్కేసర్‌లో 2,731, కాప్రాలో 3,688, కీసరలో 3,388, మేడ్చల్‌లో 2,657, మేడిపల్లిలో 3,169, ఉప్పల్–2లో 29,264, శామీర్‌పేట మండలంలో 2,324 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు సైతం శూన్యంగానే ఉన్నాయి.

గత ప్రభుత్వంలో 90 వేల కార్డులు రద్దు

మేడ్చల్ జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ (ఆహార భద్రత) కార్డులు మంజూరు కాకపోగా.. 2016లో ఉన్న రేషన్ కార్డుల నుంచి 90,040 రేషన్ కార్డులను రద్దు చేసింది. రేషన్ కార్డుల రద్దుకు అప్పట్లో చూపిన కారణాల్లో ప్రధానంగా ఉపాధి కోసం ప్రజలు వలస వెళ్లటం.. కుటుంబంలో ఆడపిల్ల వివాహం తర్వాత ఆమె పేరు తొలగించకపోవటం.. మృతిచెందిన వారి పేర్లు కూడా తీసివేయకపోవటం వంటివి పేర్కొంది. ఈ కారణాల నేపథ్యంలోనే 2016లో అప్పటి సర్కారు ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ 90,040 రేషన్ కార్డులు రద్దు చేసింది. దీంతో నిరుపేద లబ్ధిదారులు ఏళ్ల తరబడి రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై అప్పటి ప్రభుత్వం స్పందించకపోవటంతో కొందరు లబ్ధిదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. మరోసారి పరిశీలించాలని సూచనలిచ్చింది. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం రేషన్‌కార్డుల పునరుద్ధరణకు సర్వే ప్రక్రియ చేపట్టినప్పటికీ పూర్తి చేయలేకపోయింది.

కార్డుల కోసం 1.89 లక్షల దరఖాస్తులు

రాష్ట్ర ఆవిర్భావం నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదు. 2025 సంక్రాంతి నుంచి కార్డులను జారీ చేయనున్నట్లు సర్కారు ఇటీవల ప్రకటించింది. దీంతో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారితోపాటు కొత్తగా అర్జీలు పెట్టుకునేవారూ ఆశగా ఎదురుచూస్తున్నారు. గతేడాది ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం కాంగ్రెస్ సర్కారు దరఖాస్తులు స్వీకరించింది. 1.89 లక్షల అర్జీలు పౌరసరఫరాల శాఖకు చేరాయి. తాజాగా సంక్రాంతి నుంచి కొత్త కార్డులను జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించటంతో మరోసారి అర్జీలు స్వీకరించనుండటంతో సంఖ్య పెరిగే అవకాశముంది. మేడ్చల్ జిల్లాలో ప్రస్తుతం 5,32,938 రేషన్‌కార్డులు ఉండగా, 17,18,351 మంది లబ్ధిదారులు ఉన్నారు.

సీఎంఆర్ కళాశాల ఘటనపై విచారణ జరపాలి

కేపీహెచ్‌బీకాలనీ: సీఎంఆర్ కళాశాల ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని గురువారం జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోరం, ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వసతి గృహంలోని గ్రౌండ్ ఫ్లోర్ సీసీ ఫుటేజీలను పరిశీలించి విచారణ జరపాలన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తరచుగా విశ్వవిద్యాలయ పరిధిలోని బాలికల వసతి గృహాలను పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో రాహుల్ నాయక్, గోపాల చందు, సాయికుమార్ రాథోడ్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, చైతన్య, సాత్విక్, ధనుంజయ్, సాగర్, హేమంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీతో గోదావరి జలాలు వృథా



షాపూర్ నగర్ రిజర్వాయర్ వద్ద లీకేజీతో వృథాగా పోతున్న గోదావరి జలాలు

చింతల్: సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో వందలాది కిలోమీటర్ల నుంచి తీసుకువచ్చిన గోదావరి జలాలు వృథాగా ఏరులై పారుతున్నాయి. షాపూర్ నగర్ ఆవరణలో పంపింగ్ కేంద్రం వద్ద ఉన్న వాల్వ్‌లకు లీకేజీలు ఏర్పడ్డాయి. రిజర్వాయర్, కార్యాలయ ఆవరణలో ఉన్న ఈ లీకేజీని అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రిజర్వాయర్ నిండి అనేకమార్లు గోదావరి జలాలు పొంగి పొర్లుతూ హెచ్ఎంటీ జంగల్‌లోకి వెళ్తున్నాయి. ఓవైపు షాపూర్ నగర్ పరిధిలోని ఆయా సెక్షన్ల పరిధిలో వారం రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో ప్రజలు గుక్కెడు నీటి కోసం వారం రోజుల పాటు ఎదురు చూస్తుంటే.. ఇక్కడ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గోదావరి జలాలు వృథాగా పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాల్వెంట్ గోదాం.. ప్రజల్లో భయం

ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీలో అనుమతులు లేని గోదాంలు

- అగ్నిప్రమాదాలకు ఆస్కారం!
- తరలించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు

జీడిమెట్ల: ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీలో కొనసాగుతున్న అనుమతులు లేని సాల్వెంట్ గోదాంలను ఇక్కడ నుంచి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జీడిమెట్లలోని ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో రెండేళ్లుగా నిర్వహిస్తున్న సాల్వెంట్ గోదాముల్లో వివిధ రసాయనాలను కలుపుతుంటారు. ఈ క్రమంలో పొగలతో పాటు కళ్లమంటలు వస్తున్నాయని సమీప బస్తీలవాసులు ఆరోపిస్తున్నారు. సాల్వెంట్ మిక్సింగ్ గోదాములకు జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఎలాంటి అనుమతులు ఉండవు. అనుమతులు లేకుండా గోదాములు ఎలా కొనసాగిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో గోదాములు యథేచ్ఛగా నడుస్తున్నాయని స్థానికులు అంటున్నారు.



ఎస్వీకోఆపరేటివ్ సొసైటీలో గోదాంలో రసాయనాల డ్రమ్ములు

తీవ్రమైన మండే స్వభావం

ఇక్కడి గోదాముల నిర్వాహకులు బయట నుంచి రసాయనాలను కొనుగోలు చేసి వీటికి టిన్నర్ లాంటి రసాయనాలను కలిపి తీవ్రంగా మండే రసాయనాలుగా (ఎల్‌డీఓ) తయారు చేస్తారు. అనంతరం వీటిని పరిశ్రమలు, తారుప్లాంట్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఇక్కడ మిక్సింగ్ చేసిన సాల్వెంట్లు (ఎల్‌డీఓ లైట్ డీసెల్ ఆయిల్) తీవ్రమైన మండే స్వభావం కలిగి ఉంటాయని స్థానికులు పేర్కొంటున్నారు. సాల్వెంట్ గోదాములు ఒకదానికి ఒకటి ఆనుకుని ఉండటంతో అగ్నిప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తరచూ అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడంతో అప్పటి మేడ్చల్ జిల్లా కలెక్టర్ 2013లో అన్నిశాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రసాయనాల గోదాములు జీడిమెట్లలో లేకుండా చేశారు. ప్రస్తుతం మళ్లీ సాల్వెంట్ గోదాములు నిర్వహిస్తుండటంతో ఎప్పుడు ఎలాంటి అగ్నిప్రమాదాలు జరుగుతాయోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



రోడ్డు మధ్యలో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు

రోడ్డు మధ్యలో పార్కింగ్!

కుత్బుల్లాపూర్ : నిత్యం రద్దీగా ఉండే సుచిత్ర– కొంపల్లి జాతీయ రహదారి మధ్యలో భారీ వాహనాలు రోడ్డు మధ్యలోనే పార్కింగ్ చేస్తున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో బస్సులు, లారీలు, ఇతర టిప్పర్లు అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారింది. అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లు విధించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతుండగా.. మరోవైపు ఈ ప్రాంతం మీదుగా వెళ్లే వాహనాలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందుల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రోడ్డు మధ్యలో ఖాళీ స్థలం దొరికితే చాలు పార్కింగ్ చేస్తూ వెళ్తున్నారు. వీటిని కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029